
# * సినీ సుత్తి *

"హమ్మా..." వీధి లోంచి రంకె వేశాడు గోపాళం.

ఆ రంకె వినగానే పార్వతి మేనెల్లా పులకరించింది. ఆమె హృదయపు వీణ "టింగ్ చింగ్..." అంటూ రాగాలు పలికింది.




"అమ్మోయ్ ... పట్నం నుండి అన్నయ్యొచ్చాడే!!..." అంటూ హాల్లో చెంగుమంటూ ఓ గెంతు గెంతింది.

ఈలోగా గోపాళం ఇంట్లోకి వచ్చేసి అమాంతం పార్వతిని వాటేస్కున్నాడు "హమ్మా చెల్లమ్మా"

"ఛీపో... అన్నయ్యా..."

గోపాళం పార్వతిని గిరగిరా తిప్పి నేలమీదకు దించాడు. ఆ దెబ్బకి పార్వతి కళ్ళు తిరిగి దభేలుమని నేలమీద పడింది.

"వచ్చావా బాబూ!..." ప్రేమంతా కళ్ళలోనూ మాటల్లోనూ నింపి అప్యాయంగా దగ్గరకు వచ్చింది గోపాళం తల్లి అన్నపూర్ణ.

"హమ్మా!..." గోపాళం తల్లినికూడా వాటేస్కుని పైకెత్తి గిరగిరా తిప్పసాగాడు.

"జాగ్రత్త నాయనా... మీ చెల్లాయ్‌ని పడేసినట్టు నన్ను కూడా క్రింద పడేసేవు!..." భయంభయంగా అంది అన్నపూర్ణ.

అంతే!...
గోపాళం అన్నపూర్ణని పటుక్కున క్రిందికి దించేశాడు.
అతని మొహం వివర్ణమైంది. బాధతో అతని కడుపులోని పేగు మెలిపడింది.
"అమ్మా! ... నిన్ను క్రింద పడేస్తానని ఎలా అనుకున్నావ్ అమ్మా... దైవ స్వరూపురాలైన కన్నతల్లిని క్రిందపడేసేంత కసాయివాడు కాదమ్మా ఈ గోపాళం... మాతృమూర్తి పవిత్ర పాదాలమీద ధూళినైన నన్నే అనుమానిస్తున్నావా అమ్మా!!?..." చొక్కా కాలరు నలిపేస్కుంటూ, అశ్రువులు ధారాపాతంగా కారుస్తూ అడిగాడు గోపాళం.
"లేదు బాబూ... లేదు... పేగు తెంచుకుని పుట్టిన బిడ్డని అనుమానిస్తారా బాబూ ఎవరైనా? నిత్యం వెన్నంటే నీడని సంశయిస్తారా బాబూ ఎవరైనా?..." అన్నపూర్ణ కూడా ధారాపాతంగా కన్నీరు కార్చింది.
"అమ్మా..."
"బాబూ..."
"ఏంటి బాబూ... ఇంతగా చిక్కిపోయావ్?" ఒళ్లంతా తడుముతూ అడిగింది అన్నపూర్ణ.
"హిహి... నువ్వలా ఒళ్లంతా తడుముతుంటే... హిహిహి... కితకితలు పెడ్తుందే అమ్మా... హి!..."
"ఏంట్రా బడుద్దాయ్?... ఎప్పుడొచ్చావ్?" తండ్రి పరంధామయ్య ఎంట్రెన్సు ఇది.
"ఇప్పుడే నాన్నా..."
"నీ చదువదీ ఎలా సాగుతుంది?"
గోపాళం నాలుక కర్చుకున్నాడు.
"హర్రే... అమ్మనీ, చెల్లినీ గిరగిరా తిప్పే హడావిడిలో అసలు విషయం చెప్పడం మర్చిపోయా... నేను టెన్త్ పాసయ్యా నాన్నా..." ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతూ అన్నాడు గోపాళం.
పరంధామయ్య గుబురుమీసాలు గర్వంగా మెలేస్తూ "వీడు ఎవడి కొడుకనుకున్నావే!" అన్నాడు అన్నపూర్ణ వంక చూస్తూ.
అన్నపూర్ణ ఆనంద బాష్పాలు రాలుస్తూ రివ్వున పరంధామయ్య ఫోటో దగ్గరికి పరుగుతీసింది.
"చూశారా... చూశారా?... మన అబ్బాయ్ ఎంత ప్రయోజకుడయ్యాడో!!..." ఆనందబాష్పాలు ఒత్తుకుంది.
"నీ బొంద... నేనిక్కడుంటె నా ఫొటోతో మాట్లాడ్తావేం?... నేనింకా బ్రతికే ఉన్నా..." పళ్ళు నూరాడు పరంధామయ్య.

ఇంతలో లోపలి గది నుండి పాకురుకుంటూ దేకురుకుంటూ గోపాళం నాయనమ్మ జానకమ్మ వచ్చింది.
"ఏవిటర్రా సందడి!!?" అని వణికే కంఠంతో ప్రశ్నించింది.
"మన గోపాళం టెన్త్ పాసయ్యాడత్తయ్యా..." సంబరంగా చెప్పింది అన్నపూర్ణ.
"ఆహా...ఎంత చల్లని వార్త చెప్పావ్ తల్లీ... అయితే మన గోపాళంగాడు కలెక్టరు అయిపోయినట్టే!..."
"అంతే కదు అత్తయ్యా!..."
"హోయ్ ... హోయ్! అన్నయ్య కలెక్టరు అయిపోయాడోచ్!!..." ఎగిరిగంతులేసింది పార్వతి.
"ఏవండీ! మనవాడి చదువుకూడా అయిపోయింది... వాడికిక పెళ్ళి చేసెయ్యాలండీ..." అన్నపూర్ణ పరంధామయ్య నడ్డిమీద గోకింది.
"నువ్వు ఆ విషయం చెప్పాలా?... వీడికోసం ఏనాడో ఓ సంబంధం చూసి ఉంచాను" అన్నాడు పరంధామయ్య.
"ఎవరండీ?... నా కోడలు అయ్యే భాగ్యం ఎవరికండీ?"
"రామాపురం జమిందారుగారి అమ్మాయి పాపాయమ్మ!..."
"నాన్నా!..." గుండెలదిరేలా రంకెవేశాడు గోపాళం.
"పోనీ నీకు ఆ అమ్మాయి పేరు నచ్చకపోతే పెళ్ళయిన తర్వాత ఏ లతో, గీతో అని మార్చుకో..."
"అది కాదు నాన్నా..."
"మరేంటి?..."
"నేను సెవెన్త్ చదువుతుండగానే నా క్లాస్‌మేట్ రాధని ప్రేమించాను నాన్నా..."
"గోపాళం..." ఈసారి పరంధామయ్య రంకెవేశాడు.
"పెళ్ళి చేస్కుంటానని ఆ అమ్మాయికి మాట కూడా ఇచ్చాను నాన్నా..."
"నేను కూడా వాళ్ళకి మాట ఇచ్చాన్రా... ఇచ్చిన మాట ఎలా తప్పమంటావురా?..."
"నాన్నా..."
"వాళ్ళకి రేపొద్దున్న మొహం ఎలా చూపించన్రా... ఇంత విషం తెచ్చివ్వరా... మింగుతా..."
"ఏవండీ..." అన్నపూర్ణ మంగసూత్రాలను గట్టిగా పట్టుకుంది.
"అబ్బాయ్ ... ఖళ్ ... "

"నాన్నా..." పార్వతి అరిచింది. గోపాళం మౌనంగా రోదించాడు.

పరంధామయ్య గోపాళాన్ని చెయ్యిపట్టి బరబరా ఒక ముసలాయన తైలవర్ణ పటం దగ్గరికి లాక్కెళ్ళాడు.

"ఈయనెవరో తెల్సా? ... మీ తాతయ్య వెంగయ్య... కలెక్టర్ ఆఫీసులో గుమస్తా..."

"నాన్నా... " గోపాళం మూలుగు. ఇంకో చిత్రపటం దగ్గరికి లాక్కెళ్ళాడు పరంధామయ్య.

"ఈయన మీ ముత్తాత వెంగళయ్య... తాసిల్దారు ఆఫీసులో ప్యూను!..."

"నాహోన్నా..." జుట్టు పీక్కున్నాడు గోపాళం.

"ఇలాంటి వంశంలో పుట్టిన నువ్వు ఆ అమ్మాయిని ఎలా ప్రేమించావురా?..."

" ప్రేమకి కులమతాల, ఆస్తిఅంతస్థుల అడ్డుగోడలు ఉండవునాన్నా..."

"కానీ మన తండ్రీ కొడుకుల అనుబంధం ఈ ప్రేమానురాగాలూ అన్నీ వట్టివే అంటావా?..."

"నాన్నా..."

"ఇప్పటికైనా మించిపోయింది లేదు... ఆ అమ్మాయిని మర్చిపో బాబూ... సెవెన్త్‌క్లాసు చదువుతుండగా ప్రేమించిన ప్రేమకు పరిపక్వత ఉండదు బాబూ... నా మాటవిని పాపాయమ్మనే పెళ్ళి చేస్కోబాబూ..."

గోపాళం ముక్కు పొంగించాడు.

"అది ఈ జన్మకి జరగదు నాన్నా... నా హృదయం ఏనాడో రాధకి అంకితం ఇచ్చాను... నేను సెవెన్త్ చదువుతుండగా నాలో ప్రేమ అంకురించి మొలకెత్తింది... ఇప్పుడది హృదయపు లోతుల్లో బలంగా వేళ్ళుతవ్వి పెద్ద వృక్షంగా మారి బోల్డన్ని పూలూ, ఫలాలూ యిస్తుంది నాన్నా... ఇంకో విషయం నాన్నా... నేను సెవెన్త్ క్లాసులో ఉండగా ప్రేమించానని చులకనగా మాట్లాడుతున్నారు గానీ నా క్లాస్ మేట్స్ కొందరు అయిదవ తరగతిలో ఉండగానే పవిత్రమైన ప్రేమానురాగాలలో డోలికలు ఊగారు నాన్నా..."

"అయితే నీ నిర్ణయంలో మార్పురాదా?" ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు పరంధామయ్య.

"రాదు నాన్నా!"

"ఛీ ... విశ్వాస ఘాతకుడా... కనిపెంచినందుకు ఇదా నువ్వు నాకిచ్చే ప్రతిఫలం! నేన్నీకు తండ్రినీ కాను ... నువ్వు నాకు కొడుకువీ కావు..."

"అమ్మ శీలాన్ని శంకించడం అంత మంచిదికాదు నాన్నా..." బాధగా అన్నాడు గోపాళం.

"నా ఆస్తిలో నీకు చిల్లి గవ్వకూడా ఇవ్వను..."

"అలాగే నాన్నా... నా రాధని నేను రిక్షా తొక్కుకునైనా పోషిస్తాను!"

"అలాగేం... అయితే తక్షణం యింట్లోంచి వెళ్ళిపోయి రిక్షా తొక్కుకో..."

"మీ అభీష్టం అదే అయితే అలాగే వెళ్ళిపోతాను నాన్నా..."

గోపాళం ఓసారి చెల్లెలి దగ్గరికి వెళ్ళి గాఢంగా కౌగిలించుకుని, తర్వాత ఆమెని పైకెత్తి గిరగిరా తిప్పి క్రిందికి దించాడు. ఆ తర్వాత తల్లికీ, నాయనమ్మకీ కాళ్ళకి నమస్కారం పెట్టాడు. తండ్రి కాళ్ళకి నమస్కారం పెట్టాలని అనుకుంటే అతను సర్రున వెనక్కి జరిగాడు.

గోపాళం కళ్ళు తుడుచుకుంటూ గుమ్మంవైపు అడుగులు వేశాడు.

అందరూ ఘొల్లుమని ఏడ్చారు.

"ఒరేయ్ గోపాళం... ఇలారా..." పరంధామయ్య పకపకా నవ్వుతూ పిలిచాడు.

గోపాళం వెనక్కి తిరిగి ఆశ్చర్యంగా చూశాడు.

"నేను ఓడిపోయాన్రా... నువ్వే గెలిచావ్... నీ ప్రేమ ఎంత బలమైనదో తెలుసుకోవాలని పరీక్షించానురా!"

"నాన్నా... " గోపాళం ఆనందబాష్పాలు రాల్చాడు.

"కన్న తండ్రి ఎప్పుడూ కసాయివాడు కాదు బాబూ... నీకు రాధని ఇచ్చి నేను పెళ్ళి జరిపిస్తాను బాబూ... నేను జరిపిస్తాను... " గుండెల మీద గుద్దుకుంటూ అన్నాడు పరంధామయ్య.

అందరూ ఆనందబాష్పాలు శక్తివంచన లేకుండా కార్చారు. శుభం.

* * *